

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 : కనిష్ఠం 22.5

కామారెడ్డి జిల్లా వార్తలు
5
బుధవారం 3 జూలై 2024

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్, జూలై 2: జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2024 సంవత్సరానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ అవార్డ్స్ టూ టీచర్స్.ఎడ్యుకేషన్.జీవోవి.ఇన్‌లో ఈనెల 15 నుంచి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఎంపిక మార్గదర్శకాల కోసం ఎంహెచ్ఆర్‌డీ వెబ్‌సైట్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.





పరిషత్‌లు ఖాళీ

- రేపటితో ముగియనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం
- ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన
- ఇకపై మండల, జిల్లా పరిషత్‌లు సైతం వారి చేతుల్లోకే
- పదవీకాలం పెంచుతారని పలువురిలో ఆశలు
- స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత కరువు
- కుల గణన తర్వాతే చేపట్టాలని పలువురి డిమాండ్

కామారెడ్డి టౌన్, జూలై 2: గ్రామ పంచాయతీల మాదిరిగానే జిల్లా, మండల ప్రజాపరిషత్‌లు కూడా రేపటితో ప్రత్యేకాధికారుల చేతుల్లోకి పోనున్నాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం గురువారం పూర్తి కానుంది. సర్పంచ్‌ల పదవికాలం ముగిసినప్పటి నుంచి స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం లేకపోవడంతో ఇవి కూడా ప్రత్యేకాధికారుల పాలనలోకి పోనున్నాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవికాలం పూర్తయి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. జిల్లాలోని 22 మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవికాలం రేపటితో ముగియనుండగా వీరి పదవికాలం పెంచుతారని స్థానిక ప్రజాప్రతినిధులకు ఎక్కడో చిన్న ఆశ ఉండేది. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఇక పరిషత్‌లలో సైతం ప్రత్యేక పాలనే అనే సంకేతాలు వెలువడుతున్నాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవికాలం ముగియగానే ఎన్నికలు నిర్వహిస్తారని ప్రచారం జరిగినా ఎక్కడా అందుకు సంబంధించి ముందడుగు పడలేదు. అక్టోబర్‌లోనూ ఎన్నికలు నిర్వహిస్తారని లేదు మున్సిపల్ పాలకవర్గం పదవికాలం మరో 6 నెలలు ఉండగా అప్పటికే అన్ని స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం జరుగుతోంది.

హామీల అమలు నేపథ్యంలో..

ఎంపీ ఎన్నికలకు ముందే గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం పూర్తయింది. ఆ ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని భావించారు. ఇందుకు సంబంధించి ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేసినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే సర్పంచ్ ఎన్నికలకు వెళితే బాగుండదనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు చేసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాచేస్తే తమ పార్టీకి కలిసివస్తుందనే ఉద్దేశ్యంతో అప్పట్లో పంచాయతీ ఎన్నికలను వాయిదా వేశారనే చర్చ సాగుతోంది. ఆ ఎన్నికలు వాయిదా పడటంతో పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన తప్పలేదు. ఆ వెంటనే పార్లమెంట్ ఎన్నికలు ప్రారంభమై ముగిశాయి. అయినా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం బయటకు రాలేదు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారో లేదో ఇప్పటికీ సందేహంగానే మారింది.

పదవికాలం కొనసాగిస్తారనే ఆశ

మరో రెండు రోజుల్లో ముగియను న్న జడ్పీ, మండల అధ్యక్ష పదవికాలాన్ని మరికొన్ని నెలల పాటు పొడగించే అవకాశం ఉందని పలువురు జడ్పీటీసీ, ఎంపీటీసీలు ఆశపడ్డ వారి ఆశలు నిరాశగానే మిగిలాయి. కానీ గతంలో సర్పంచ్‌ల పదవికాలం ముగియగానే ప్రభుత్వం వెంటనే ప్రత్యేక అధికారులను నియమించి రికార్డులను స్వాధీనం చేసుకుంది. ఇదే బాటలో పరిషత్‌లలో సైతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుందని తెలుస్తోంది. ఒక వేళ వీరికి పదవికాలం పొడగిస్తే సర్పంచ్‌లుగా పనిచేసిన వారి నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది.

అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు ఒకేసారేనా?

అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారనే చర్చ జరిగినా అది కూడా కుదరపోవచ్చని అధికార పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు తేల్చాల్సి ఉంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గాయని సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ సారి బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. కులగణన చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయకుండా ఎన్నికలకు వెళితే బీసీ కులాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వమే కులగణన చేస్తామని తీర్మానం చేసింది. అలాగే ఆగస్టు 15లోపు రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేయకుండా మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే ఓట్లు అడగడానికి అవకాశం ఉండదని చర్చ లేకపోలేదు. ఈ నేపథ్యంలో అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సాధ్యం కాకపోవచ్చని జనవరిలో మున్సిపల్ పాలకవర్గాలు ముగిశాక అన్ని స్థానిక సంస్థలకు ఒకేసారి నిర్వహిస్తారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



బాన్సువాడలో పోచారం ఇంటి వద్ద ఆలింగనం చేసుకుంటున్న కాసుల బాల్‌రాజ్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఔను వాళ్లిద్దరూ.. ఒక్కటయ్యారు!

- 15ఏళ్ల తర్వాత కలిసిన గురు శిష్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాలరాజ్
- నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాను
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, బాన్సువాడ టౌన్, జూలై 2: నిన్నామొన్నటి వరకు వేర్వేరు పార్టీల్లో ఉంటూ ప్రత్యర్థులుగా ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాలరాజ్‌లు ఎట్టకేలకు ఒక్కటయ్యారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కాసుల బాల్‌రాజ్, ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డిలు 15 సంవత్సరాల క్రితం టీడీపీలో గురు శిష్యులుగా పేరొందారు. అయితే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గత జూన్ 21న సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో గురు శిష్యులు మళ్లీ ఒక్కటైనట్లయ్యింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల ప్రకారం మంగళవారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి కాసుల బాల్‌రాజ్ కాంగ్రెస్ కార్యకర్తలతో భారీ ర్యాలీగా చేరుకుని శాలువాతో సన్మానించి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో చాన్నాళ్ల తర్వాత గురు శిష్యులు మళ్లీ ఏకం అయ్యారంటూ నాయకులు, కార్యకర్తలు ముచ్చటించుకున్నారు.

మంత్రి పదవి కోసం కాంగ్రెస్‌లోకి రాలేదు..

తాను మంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీలోకి రాలేనని, బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పార్టీలో చేరినట్లు మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం బాన్సువాడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతోనే ప్రారంభమైం దన్నారు. 1977లో ప్రారంభమై 1984 వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానన్నారు. అనంతరం 1984 అక్టోబరులో టీడీపీ అధినేత ఎన్టీ రామారావు టీడీపీలోకి ఆహ్వానించడంతో అప్పటి నుంచి 2011 వరకు టీడీపీలోనే ఉంటూ ఎమ్మెల్యే, మంత్రిగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. అదే విధంగా 2011లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీలోకి చేరి మంత్రిగా, స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పతనం కావడంతో తన రాజకీయ భవిష్యత్‌తో పాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం 2024 జూన్ 21వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు పోచారం వివరించారు. కాంగ్రెస్ పార్టీతోనే ఇకపై తన రాజకీయ జీవితాన్ని ముగింపు చేస్తానన్నారు. నియోజకవర్గం లోని ప్రతీ ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటానని తెలిపారు. కొత్త, పాత కార్యకర్తలు కాకుండా అందరం ఒక కుటుంబంగా కలిసిమెలిసి ఉండాలన్నారు. అద్దెకు వచ్చి ఉన్నవాళ్లు వెళ్లక తప్పదన్నారు. లోకల్ లోకలేనని, నాన్ లోకల్ నాన్‌లోకల్ అని తెలిపారు. భవిష్యత్‌లో బాన్సువాడలో కాంగ్రెస్ పార్టీ జెండా ఒక్కటే ఉండాలని పార్టీ శ్రేణులకు పోచారం పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే పోచారానికి నాకు ఎలాంటి శత్రుత్వం లేదు

- రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి నాకు ఎలాంటి శత్రుత్వం లేదని కేవలం రాజకీయంగా మాత్రమే పోరాడాను తప్ప వ్యక్తిగతంగా ఏమి లేదని రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి కాసుల బాల్‌రాజ్ బాన్సువాడ పట్టణంలో భారీ ర్యాలీగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి వెళ్లి సన్మానించి కాంగ్రెస్‌పార్టీలోకి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పోచారంతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తో కలిసి గత 15 సంవత్సరాల క్రితం టీడీపీలో పని చేశానని రాజకీయ పరిణామాల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీలోకి చేరి ఎమ్మెల్యే పోచారంపైన మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయానని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి కట్టుబడి ఉన్నాను కాబట్టి సీఎం రేవంత్‌రెడ్డి తనకు రాష్ట్ర ఆగ్రోస్ ఇండ స్ట్రీస్ చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీని వాస్‌రెడ్డితో కలిసి బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరి స్తామని ఆయన తెలిపారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

గ్రామాల్లో నిర్వహించే పనులపై కలెక్టర్ సమీక్ష

కామారెడ్డి టౌన్, జూలై 2: జిల్లాలోని ఆయా విభాగాల అధికారులతో మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల, సానిటేషన్, తాగునీరు, గ్రామ పంచాయతీల ఇంటి పన్ను చెల్లింపులు, గ్రామ పంచాయతీల కరెంట్ బిల్లులు, ట్రాక్టర్, ట్యాంకర్ చెల్లింపులు, కంపోస్ట్‌షెడ్ నిర్వహణ, ఉపాధి హామీ పనులు, హరితహారం, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్వహణ, నేషనల్ పంచాయతీ అవార్డులు, లేవుట్‌లపై, భవనాల అనుమతులపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు, డివిజనల్, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

అతి త్వరలో.. కేసీఆర్ దుకాణం బంద్!

ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

భిక్కనూరు, జూలై 2: అతి త్వరలోనే రాష్ట్రంలో కేసీఆర్ దుకాణం బంద్ అవుతుందని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. మంగళవారం భిక్కనూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్, ఆయన కుటుంబం అంతా మేమే అన్నట్లు వ్యవహరించారని అందుకే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. తన ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లు, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్‌ను రద్దు చేయాలని కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసి మొట్టికాయలు వేసిందని అన్నారు. హైకోర్టులో ఎదురుదెబ్బ తగలడంతో కేసీఆర్ ఉక్కిరిబిక్కిరవుతున్నారని అన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రాజకీయ లబ్ధి కోసమే ఆగమేఘాల మీద రూ. వేల కోట్లతో కేసీఆర్ కాళేశ్వరం, మోదీ అయోధ్య రామాలయాన్ని నిర్మించారని వాటిని నాణ్యతతో నిర్మించకపోవడంతో కాళేశ్వరం కుంగుతుందని, అయోధ్య రామాలయం ఊరుస్తుందని ఆరోపించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ ప్రసంగంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని, రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా నిర్వహించిన పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలను కలిసి వారి సమస్యలపై తెలుసుకుని వారి కోసం నియంత మోదీపై పార్లమెంట్‌లో పోరాడుతున్నాడని అన్నారు. ఎమ్మెల్యే ఫిరాయింపుల విషయాన్ని కేటీఆర్ వక్రీకరిస్తున్నాడని, బీఆర్ఎస్ గతంలో తమ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను ఒకేసారి కాకుండా చాలాసార్లు 49 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను చేర్చుకుం దన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్య క్షుడు కైలాస్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు, రుణమాఫీ

ప్రభుత్వం త్వరలోనే కొత్త రేషన్‌కార్డులతో పాటుగా ఎన్ని కల సమయంలో హామీ ఇచ్చిన మేరకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశానికి హాజరైనా ఆయన ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక రివ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖపై మాట్లాడుతూ పంటనష్ట పరిహారం, వానాకాలం పంటలకు కావాల్సిన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, వ్యసాయసాగులో రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. వడగండ్ల వర్షానికి నష్టపోయిన రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం అందించారన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం విద్యుత్ శాఖపై మాట్లాడుతూ వ్యవసాయానికి, గృహాలకు కరెంట్ కోత విధిస్తే సహించేది లేదన్నారు. వ్యవసాయానికి కరెంట్ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పాత హరిజనవాడకు వెళ్లే దారి మధ్యలో ఉన్న కరెంట్ స్తంభాన్ని తొలగించడానికి రూ.13 వేలు, మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని హరిజనవాడలో 20 మంది నిరుపేదలకు కొత్త విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు రూ.30వేలను షబ్బీర్‌అలీ విద్యుత్ అధికారులకు అందజేశారు. పనులను వెంటనే చేపట్టి సమస్యను తొలగించాలన్నారు. ఈ మేరకు విద్యాశాఖపై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని ర్యాగట్ల పల్లి గ్రామం నుంచి మెదక్ జిల్లా లక్ష్మాపూర్ వరకు బీటీరోడ్డు మంజూరు కాగా అందులో కొద్ది దూరం ఫారెస్ట్ ఉందని దీనిపై మెదక్ ఫారెస్ట్ అధికారులను కలిసినా స్పందించడం లేదని పీఆర్ ఏఈ సోహెల్ షబ్బీర్‌అలీ దృష్టికి తీసుకురాగా మెదక్ ఎఫ్ఆర్‌వోతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించి బీటీ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కోరారు. మండలంలోని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే తాను సహిం చేది లేదన్నారు. గత 5 సంవత్సరాలుగా ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీటీసీలు మండల అభివృద్ధికి ఎంత గానో కృషి చేశారని కొనియాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలు పంచుకునే వాడికి ప్రజల్లో ఎల్లప్పుడు ఆదరణ ఉంటుందన్నారు. తాను ఎల్లప్పుడు నియోజకవర్గ ప్రజల కోసమే పని చేశానని, మున్ముందు పని చేస్తానని అన్నారు. ఈ మేరకు ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఎంపీటీసీలు సైతం షబ్బీర్‌అలీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ శివప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్లు కిష్టాగౌడ్, సిద్ధి రాములు, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీ చంద్ర కాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, నాయకులు, మాజీ సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ



ఆర్గొండ సొసైటీ వద్ద ఎరువుల కోసం రాళ్లు, సంచులను వరుసలో ఉంచిన రైతులు

ఎరువుల కోసం రైతుల బారులు

రాజంపేట, జూలై 2: మండలంలోని ఆర్గొండ సొసైటీ కార్యాలయం ఎదుట ఎరువుల కోసం మంగళవారం రైతులు బారులు తీరారు. వర్షాలు ఆలస్యంగా పడడంతో ముందుగా వేసిన విత్తనాలు మొలక రాకపోవడంతో దున్నేసి మళ్లీ విత్తనాలు వేయడం కోసం సొసైటీ ముందు క్యూలైన్‌లో నిల్చున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒక్కసారిగా విత్తనాలు, ఎరువుల కోసం సొసైటీల ముందు రైతులు బారులు తీరారు. సొసైటీకి రోజుకు ఒక్క లారీ చొప్పున లోడ్ వస్తుండడంతో అందరికీ సరిపోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో రాళ్లు, సంచులను లైన్‌లో నిల్చోపెట్టి ఎరువులు తీసుకుంటున్నట్లు రైతులు తెలుపుతున్నారు.

తాడ్వాయి రూరల్: మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో మంగళవారం రైతులు ఎరువుల కోసం బారులు తీరారు. చాలీచాలని ఎరువులతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఉదయం నుంచే రైతులు గోదాముల వద్ద పడిగాపులు కాస్తున్నారు. బయట మార్కెట్‌లో యూరియా ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారని ప్రభుత్వం సింగిల్ విండో ద్వారా విక్రయించే యూరియా తక్కువ రేటుకు దొరుకుతుందని రైతులు పెద్దఎత్తున సొసైటీల వద్ద బారులు తీరుతున్నారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

సాదాసీదాగా సాగిన బోధన్ సర్వసభ్య సమావేశం

బోధన్‌రూరల్,జులై2: బోధన్ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదా కొనసాగింది. బోధన్ మండల పరిషత్ సర్వసభ్య చివరి సమావేశం మంగళవారంతో ముగిసింది. రేపటితో పదవి కాలం ముగుస్తుండడంతో పాలకవర్గాన్ని మండల స్థాయి అధికారులు ఘనంగా సన్మాంచి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ, బుద్దె సావిత్రి రాజేశ్వర్ జడ్పీటీసీ లక్ష్మి గిర్ధావర్ గంగారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ప్రజలకు అనేక సేవలు చేశామని కొనియాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల కోసం కృషి చేసిన ఎంపీటీసీలను కొనియాడారు. ఇటీవల మృతి చెందిన సాలూర విండో మాజీ చైర్మన్ బుద్దె రాజేశ్వర్, కొప్పర్గ సర్పంచ్ ఖలీల్ పటేల్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ శరత్, గిర్ధావర్ గంగారెడ్డి మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలన్నారు. అధికారులు సమన్వయంతో ఎప్పటికప్పుడు బోధన్, సాలూర మండలాల ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఎంపీడీఓ వెంకటేష్ జాదవ్, ఎంపీఓ మధుకర్, తహసీల్దార్ గంగాధర్, సీడీపీవో జానకి, ఎంపీటీసీలు, మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భారతీయ న్యాయ సంహిత చట్టాలపై అవగాహన

రుద్రూరు, జూలై 2 : రుద్రూరు మండలంలోని అంబం (ఆర్) ఆదర్శ పాఠశాలలో మంగళవారం నిజామాబాద్ జిల్లా మహిళా సాధికారత కేంద్రం బృందంచే విద్యార్థులకు భారతీయ న్యాయ సంహిత చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖీ బృందం సభ్యులు సమాజంలో బాలిక విద్యా ప్రాధాన్యత, బాల్య వివాహాలు, సుకన్య సమృద్ధి యోజన, బాలిక విద్య, బేటి బచావో బేటి పడావో తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహనలో విద్యార్థులకు ఎన్నో అనుమానాలను నివృత్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం బృందం సభ్యులు ఎం. కార్తీక, బానుప్రియ, పుష్ప, స్వప్న, ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపక బృందం, 500 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

బోధన్‌రూరల్,జులై2: నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉషోదయ కళాశాల డైరెక్టర్ దుశ్యంత్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో టాస్క్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు జరుగుతాయన్నారు. జెన్‌ప్యాక్ట్ కంపెనీ, ఎంఎన్‌సీ క్యాంపస్ డ్రైవ్ సెలక్షన్స్ నిర్వహిస్తుందన్నారు. అర్హులైన నిరుద్యోగ యువత బీకాం, బీఎస్సీ, బీటెక్, ఎంబీఏ విద్యార్థులు 2022-24 విద్యాసంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉదయం 9గంటలకు తమ సర్టిఫికెట్లతో హజరుకావాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరుద్యోగ యువత వచ్చేటప్పుడు తమ ఆధార్ కార్డు, రెజ్యూం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, అన్ని సర్టిఫికేట్లు తీసుకురావాలన్నారు. 2015నుండి ఉషోదయ విద్యాసంస్థలు ప్రతి సంవత్సరం బోధన్ పట్టణంలో డిగ్రీ విద్యా ద్వారా ఇంజనీరింగ్, బీటెక్ కళాశాలలకు దీటుగా క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తూ తక్కువ వ్యవధిలో డిగ్రీ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను పొందుతున్నారన్నారు.ఉషోదయ విద్యాసంస్థలు నిరంతరం విద్యా అభివృద్ధితో పాటు విద్యార్థులకు ఉపాధి కల్పన లక్ష్యంగా సర్వతోముఖంగా విద్యార్థులను తీర్చి దిద్దుతుందన్నారు.టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్, జెన్‌ప్యాక్ట్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, శ్రీహరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోస్రాలో మద్యం తాగి ఒకరి మృతి

మోస్రా,జులై2: మోస్రా మండల కేంద్రంలోని వైన్స్‌లోని పర్మిట్ రూంలో ఓ వ్యక్తి మరణించిన ఘటన చోటు చేసుకుంది. ఓ వ్యక్తి ప్రాణంపోయిన వైన్స్ యాజమానులు తమకేం పట్టనట్లు తమ వ్యాపారం చేసుకుంటూ ఉండిపోయారు. పోలీసులు వచ్చిన కనీసం మద్యం అమ్మడం ఆపలేదు. వివరాల్లోకి వెళితే.. బోధన్ రూరల్ మండలం పెగడాపల్లి గ్రామానికి చెందిన బైరగి శ్రీను తండ్రి సాయిలు వయస్సు 30సంవత్సరాలు ఇతనికి భార్య, పిల్లలు పది సంవత్సరాల పాపా, బాబు 8సంవత్సరాలు ఉన్నారు. తిమ్మాపూర్ గ్రామంలో అతని బంధువు చనిపోతే అంత్యక్రియలకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో మోస్రా మండల కేంద్రంలోని వైన్స్‌కు అందాజా సాయంత్రం 4గంటల ప్రాంతంలో వచ్చి మద్యం సేవించి కక్కుకొని అక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఇట్టి విషయంపై కేసు నమోదు చేసుకున్నామని ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. ఇక్కడ అమ్ముతున్న కల్తీ మద్యం తాగి మరణించాడని స్థానికులు మాట్లాడుకుంటున్నారు. ఈ కేసు దర్యాప్తులో సీఐ జయేష్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.



పర్మిట్ రూంలో మరణించిన శ్రీనివాస్

శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన యంచ గ్రామస్థుడు

నవీపేట,జులై2: మండలంలోని యంచ గోదావరిలో దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడుతున్న వ్యక్తిని మంగళవారం పలువురు స్థానికులు కాపాడారు. నిర్మల్ జిల్లా బాసర మండలం మైలాపూర్‌కు చెందిన నగేష్ అనే వ్యక్తి మంగళవారం ఉదయం యంచ గోదావరి బ్రిడ్జి నుంచి నదిలో దూకడానికి ప్రయత్నించాడు. ఇదే సమయంలో అటు వైపుగా వెళ్తున్న పలువురు యంచ గ్రామస్థులు వెంటనే అతనిని పట్టుకుని గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించి అతనిని వారికి అప్పగించారు. కుటుంబ కలహాలతోనే తాను ఈ అఘాయిత్యానికి పాల్పడబోయినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన లింగం, నారాయణ, సంతోష్‌లను గ్రామస్థులు అభినందించారు.



వ్యక్తిని కాపాడుతున్న గ్రామస్థుడు

నవీపేటలో అక్రమ నిర్మాణం నిలిపివేత

నవీపేట,జూలై2: మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో అక్రమంగా మరుగుదొడ్డి ట్యాంక్ నిర్మాణ పనులు చేపడుతుండగా పంచాయతీ అధికారులు మంగళవారం నిలిపివేశారు. స్థానిక అంగడిబజార్ పక్కనే ఉన్న ఓ కాంప్లెక్స్ యాజమాని అంగడిబజార్‌కు చెందిన స్థలంలో మరుగుదొడ్డి ట్యాంక్‌కు సంబంధించి పెద్ద గొయ్యి తవ్వించాడు. ఈ విషయాన్ని పలువురు స్థానికులు డీపీవోతో పాటు స్థానిక పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశం మేరకు అక్రమంగా తవ్విన గుంతను జేసీబీ సాయంతో పంచాయతీ అధికారులు పూడ్చివేయించారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పంచాయతీ అధికారులు హెచ్చరించారు.

బాల కార్మికులతో పని చేయిస్తే కఠిన చర్యలు

● అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నరేందర్ రాజు

ఎడపల్లి, జూలై 2: బడి ఈడు పిల్లలతో ఎవరైనా పని చేయిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నరేందర్ రాజు అన్నారు. మంగళవారం ఎడపల్లి మడల కేంద్రంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్న బాల కార్మికున్ని గర్తించి దుకాణం యజమానితో మాట్లాడి పిల్లలతో పని చేయించవద్దని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడతూ బాల కార్మికుల నిర్మూలనే లక్ష్యంగా ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఎడపల్లి మండల కేంద్రంలో తనిఖీ చేయడం జరిగిందని, ఎవరైనా బాల కార్మికులతో పని చేయిస్తే యజమానికి 60 వేల రూపాయల జరిమానాతో పాటు 2 నుండి 6 నెలల వరకు జైలు శిక్ష ఉంటుందని ఆయన హెచ్చరించారు. బాల కార్మికులు లేని సమాజం నిర్మించుకోవడానికి ప్రతి ఒక్కరు పాటు పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లీగల్ కం ప్రొహిబిషన్ ఆఫీసర్ అనిల్, కానిస్టేబుల్ షౌకత్ బేగం, ఎన్జీఓ సభ్యురాలు మమత తదితరులు ఉన్నారు.

పోచారాన్ని కలిసిన మోస్రా నాయకులు

మోస్రా,జూలై2: మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీమంత్రి, మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత మొదటిసారి నియోజకవర్గంకు వచ్చిన సందర్భంగా బాన్సువాడలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షులు తోట రాజు, సీనియర్ నాయకులు హరి నారాయణ, ఓబీసీ జిల్లా కార్యదర్శి అశోక్, శివ కుమార్, మాజీ వార్డు మెంబర్ ఖాసీం, అశోక్, తరుణం సాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

నవీపేట,జులై2: రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని, గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్-2, 3 నోటిఫికేషన్ అదనంగా పోస్టులను పెంచాలని జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు బండారి రాజశేఖర్, వెంకటేష్, బాలు గౌడ్, నంద వంశీ, దినేష్, శివ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ,షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ముప్కాల్, జూలై2: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను ఎంపీపీ సామ పద్మ చేతుల మీదగా అందజేశారు. ముప్కాల్ మండలంలోని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణలక్ష్మీ 28, షాదీముబారక్ రెండు చెక్కులు మంజూరు కాగా ముప్కాల్ లో పది, కొత్తపల్లిలో ముగ్గురికి, నాగంపేట్‌లో ఒక్కరికి, నల్లూర్‌లో ఐదుగురికి, రెంజర్ల ఆరుగురికి, వేంపల్లిలో ఐదుగురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ తహసీల్దార్ శ్రీధర్, సామ వెంకట్‌రెడ్డి, సంద రవి, చిన్నారెడ్డి, బద్దం సాగర్, ముస్కు మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాగంపేట్‌లో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ముప్కాల్, జూలై2: మండలంలోని నాగంపేట్ గ్రామంలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి స్థానంలో మెండోర, ద్వితీయ స్థానంలో నాగంపేట్ జట్టు నిలిచాయని ఆర్గనైజర్ మేడిపల్లి ముత్యంరెడ్డి, మోహన్‌రెడ్డిలు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు నగదు పురస్కారంతో పాటు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు మేడిపల్లి ముత్యంరెడ్డి, మోహన్‌రెడ్డి, సతీష్, అనిల్, రెడ్డిస్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

బోధన్‌రూరల్,జులై2: బోధన్ మున్సిపాలిటీలోని పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికుల సేవలు మరువలేనివని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్మికురాలు లక్ష్మి పదవి విరమణ పొందడంతో ఆమెను తమ వార్డులోని కాలనీవాసుల మధ్య సన్మానించారు. తెల్లవారుజామునే పారిశుధ్య పనులు నిర్వహిస్తూ పట్టణాన్ని సుందరీకరణగా ఉంచడంలో వీరి పాత్ర చాలా ముఖ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఏర్గట్ల, జులై 2: మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో బోదాసు గంగాధర్ ఇటీవలే తాటి చెట్టుపై నుండి పడి మృతి చెందగా మంగళవారం మంగళవారం గ్రామంలోని యూఏఈ ఎన్నారై సభ్యులు ఆర్థిక సహాయంగా 50 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. యూఏఈ ఎన్నారై సభ్యులు ఉత్కం శ్యామ్ సుందర్ గౌడ్, బండి సృజన్, బోదాసు దేవేందర్, ఆడెం ప్రతాప్, ఆడెం గంగారెడ్డిలు పాల్గొన్నారు.

షిఫ్టింగ్ యంత్రాలతో పొలాల వద్దకు కేజ్‌వీల్స్ ట్రాక్టర్

● రోడ్డుపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు తిప్పకుండా చర్యలు ● షిఫ్టింగ్ యంత్రాలతో తరలింపు ● ఖర్చు అయినా.. సహకరిస్తున్న రైతులు


షిఫ్టింగ్ యంత్రాలతో తరలిస్తున్న కేజ్‌వీల్స్


కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్‌పై ఎక్కించుకొని వెళ్తున్న దృశ్యం

డొంకేశ్వర్, జూలై2: వరినాట్లు వేయాలంటే కేజీవీల్స్‌తో పొలాన్ని దమ్ము చేయాలి. కానీ కేజీవీల్స్ ట్రాక్టర్లు ఒక చోట నుంచి మరో చోటికి తారురోడ్డుపై వెళ్లే కోట్లాది రూపాయలు పెట్టి వేసిన తారు రోడ్లు కేజీవీల్స్ ట్రాక్టర్లు తిరగడంతో రోడ్లన్ని ధ్వంసం అవుతాయి. చాలా కాలం పాటు నాణ్యతగా ఉండాల్సిన రోడ్డు వేసిన కొది్దపాటి రోజులకే గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారవుతున్నాయి. దీంతో ట్రాక్టర్ యాజమానులు రోడ్లను కాపాడేందుకు ప్రత్యేకంగా ఆలోచించారు. గతంలో పోలీసు శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించిన విధంగానే రోడ్లు ధ్వంసం కాకుండా ఉండేందుకు తమ వంతు కట్టడి చేసుకున్నారు. డొంకేశ్వర్, తొండాకూర్ గ్రామాల ట్రాక్టర్ యూనియన్ యాజమానులు కేజీవీల్స్ ట్రాక్టర్ పొలానికి తరలించేందుకు ప్రత్యేకంగా ట్రాలీని ఏర్పాటు చేసుకున్నారు. కేజీవీల్స్ ట్రాక్టర్ ప్రత్యేకంగా తయారు చేయించిన ట్రాలీకి తరలించే ట్రాలీపై కేజీవీల్స్ ట్రాక్టర్‌ను ఎక్కించి అవసరం ఉన్న చోటికి తరలిస్తున్నారు. ఇక్కడ పని పూర్తవ్వగానే మళ్లీ ఎక్కించి మరో చోటకు మళ్లీ ట్రాలీపైకి ఎక్కించి తరలిస్తున్నారు. దీని ద్వారా ఎవరైతే రైతు పొలాన్ని కేజీవీల్‌తో కరిగేట్ చేయాలనుకుంటున్నారో ఆ ట్రాక్టర్ యాజమాని షిఫ్టింగ్ యంత్రానికి రూ.500లు చెల్లిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మరో విధంగా కూడా కేజీవీల్స్ ట్రాక్టర్‌ను తరలిస్తున్నారు. సాధారణ ట్రాక్టర్ వెనుక కేజీవీల్స్ ట్రాక్టర్‌పైకి కేజీవీల్స్ చక్రాలు రోడ్డుపై తిరగకుండా టైర్లతో కూడిన ముందు చక్రాలు మాత్రమే రోడ్డుపైకి తిరుగుతూ కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ను రైతులు పొలంలోకి ఒక్క చోట నుంచి మరో చోటికి తీసుకువెళ్లేందుకు ఆలోచించారు. రైతులకు దీని ద్వారా పొలంలోకి తీసుకువెళ్లేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కేజీవీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై తిరిగే అవకాశం లేకుండా పోయిన రైతులకు భారమైన రోడ్లు ధ్వంసం కాకుండా అధికారులు అవగాహన కల్పించిన విధంగా రైతులు ముందుకు సాగుతున్నారు.

రోడ్లు ధ్వంసం కాకుండా కాపాడేందుకే



ప్రభుత్వాలు కోట్ల రూపాయలు వెచ్చించి వేసిన రోడ్లను కాపాడేందుకు గాను ట్రాక్టర్ యజామానులం దరు కలిసి షిఫ్టింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసుకున్నాం, దీని ద్వారా కేజీవీల్స్ ట్రాక్టర్ల ఒక చోటి నుంచి మరో చోటికి రోడ్లపై తిరగకుండా సులువుగా షిఫ్టింగ్ యంత్రంపై తీసుకువెళ్తాం. రోడ్ల మీద కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు తిరిగినట్లయితే రోడ్ల మీద గుంతలు ఏర్పాడుతాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది ట్రాక్టర్ యాజమానులు అందరు కలిసి ఈ షిఫ్టింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసుకున్నాం.

- నిమ్మల సురేష్, ట్రాక్టర్ యాజమాని, డొంకేశ్వర్

కేజ్‌వీల్స్ ట్రాక్టర్ యజమానికి జరిమానా


రోడ్డుపై వెళ్తున్న కేజ్‌వీల్‌ట్రాక్టర్

డొంకేశ్వర్, జూలై2: డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామంలో తారు రోడ్డుపై వెళ్తున్న కేజీవీల్స్ ట్రాక్టర్‌ను మంగళవారం ఆర్అండ్‌బీ ఏఈ రఘు ప ట్టుకున్నారు. కేజ్‌వీల్స్‌తో నిబంధనలకు విరుద్ధంగా తారురోడ్డుపై తిరుగుతున్న ట్రాక్టర్‌నుపట్టుకొని యజామానికి రూ.1500 జరిమానా విధించారు. తారు రోడ్డుపై ట్రాక్టర్లు తిరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను షిఫ్టింగ్ యంత్రాలు కేజ్‌వీల్స్‌కు పట్టీలు ఏర్పాటు చేసి పొలాల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సర్క్యులర్ జారీ చేశామని ఆయన తెలిపారు.

రూ.50 కోట్లతో మండలాన్ని అభివృద్ధి చేశాం

● ఎంపీపీ లత ● ముగిసిన ఎంపీటీసీల పదవీకాలం


ఎంపీటీసీలను సన్మానించిన అధికారులు

మోపాల్, జూలై 2:అందరి సహకారంతో మండలాన్ని ఐదేళ్ల కాలంలో సుమారు రూ.50కోట్ల వ్యయంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని మోపాల్ మండల పరిషత్ అధ్యక్షురాలు లత అన్నారు. ఎంపీటీసీల పదవీకాలం ఈనెల 3వ తేదీన ముగియడంతో మంగళవారం మండల అభివృద్ధి అధికారి ఎంపీటీసీలకు సన్మాన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో అందరి సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. తాము పదవిలోకి రాగానే రెండు సంవత్సరాలు కరోనాతోనే గడిచిపోయిందని అయినప్పటికి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. ఈఐదేళ్ల కాలంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తమకు సహకారాన్ని అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనితతో పాటు ఆయా గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు. అనంతరం వీరందరికి ఎంపీడీవో మండల స్థాయి అధికారులతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లింగం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


వ్యవసాయ కూలీలకు ఇళ్లను మంజూరు చేయాలి

డొంకేశ్వర్, జూలై2: వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తేవాలని ఏఐకెఎంఎస్ అధ్యక్షుడు కె.గంగాధర్ మంగళవారం డొంకేశ్వర్ మండలంలోని తహసీల్దార్ వెంకటరమణకు పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ.12వేల హామీని నెరవేర్చాలని, బీడీ, గీతకార్మికులకు ఇస్తున్న రూ.2016లాగానే వ్యవసాయ కార్మికులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం తీసుకువచ్చి 60ఏళ్లు పైబడిన కార్మికులకు నెలకు రూ.10వేల చొప్పున పెన్షన్ అందించాలన్నారు. అన్ని రోగాలకు వర్తింపజేసే విధంగా హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని, ఇండ్ల నిర్మాణానికి స్థలం కేటాయించి రూ.10లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజలింగం, దేవన్న, కూశన్న, వంజరి, గంగాధర్, ఉమ్మెడ గంగారాం, జువ్వన్న, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక

బోధన్‌రూరల్,జూలై2: విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే.ప్రభాకర్ చారి, ప్రధాన కార్యదర్శిగా కే.రమేష్ చారి, కోశాధికారిగా నారోజి వెంకట రమణ చారి, ఉపాధ్యక్షులుగా వడ్ల శంకర్, సురేందర్ చారి, ముఖ్య కార్యదర్శిగా ఎం.రాజశేఖర్, కే.రమణ చారి, ప్రచార కార్యదర్శి వీరేశం చారి, కార్యవర్గ సభ్యులుగా పీ.శంకర్ చారి, కే.రాము చారి, ఏ.కృష్ణ చారి, ఎస్.హరీష్ చారి, గంగాధర్ చారి, రాములు, సుదీప్ చారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. సలహాదారులుగా రాందాస్ చారి, మారోజు మురహరి చారి, పీ.లక్ష్మణ్ చారి, నాగభూషణం చారి, బాలాజీ చారి, సుధాకర్ చారి, కే.కాళిదాస్ చారి తదితరులు ఎన్నికయ్యారు.

ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు


పోలీస్ స్టేషన్‌కు తరలించిన మొరం టిప్పర్

కోటగిరి,జూలై2: మొరం, ఇసుక అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని పొతంగల్ తహసీల్దార్ మల్లయ్య హెచ్చరించారు. పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారం సమీపంలో మొరం అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌తో పాటు పొతంగల్ మండల కేంద్రంలో మంజీర నది సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ పట్టుకున్నారు. మొరం టిప్పర్‌కు, ఇసుక ట్రాక్టర్‌కు 5వేల రూపాయల చొప్పున జరిమాన విధించినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక, మొరం అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'పారదర్శకంగా పదోన్నతులు, బదిలీల నిర్వహణ'

నిజామాబాద్ అర్బన్, జూలై 2: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించినందుకు జిల్లా విద్యాశాఖ అధికారికి పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు జమీలుల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్‌ను కలిసి అభినందనలు తెలిపారు. అప్‌గ్రేడ్ అయిన పోస్టులకు క్యాడర్ స్ట్రెంత్ త్వరగా ఇచ్చి సప్లై మానిటరి వేతనాలు చేసుకునే విధంగా ప్రొసిడింగ్స్ ఇవ్వాలని డిఇవోను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమణాచారి, శ్రీమన్నారాయణ, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

● వ్యాయామ ఉపాధ్యాయుల కృతజ్ఞతలు...

వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులను నిర్వహించినందుకు సిఎం రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్‌కు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్‌లు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలను సమన్వయపరుస్తూ జిల్లాలో సమర్థవంతంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను డిఇవో నిర్వహించారని కొంత మంది కావాలనే డిఇవోపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటిని మానుకోవాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై అక్రమాలు జరిగినట్లు ప్రచారం జరుగుతుందని కానీ ఏ ఒక్క వ్యాయామ ఉపాధ్యాయులు విద్యాశాఖలో ఏ ఒక్కరికి కూడా డబ్బులు ఇవ్వలేదని కావాలని కొంత మంది చేస్తున్న ప్రచారం అన్నారు.

● పీఆర్టీయూ తరపున ధన్యవాదాలు

జిల్లాలో నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను సమర్థవంతంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించినందుకు జిల్లా విద్యాశాఖ అధికారికి పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్‌లు ధన్యవాదాలు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ప్రమోషన్లతో పాటు ఎస్‌జిటిల ప్రమోషన్లు, ఇతర ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను రోస్టర్ కమ్ మెరిట్ లిస్టులన్ని కూడా డిఎస్ఇలోనే అధికారులు తయారు చేసి జిల్లాలకు పంపించారని జాబితాల తయారీలో జిల్లా విద్యాశాఖ అధికారికి ఎలాంటి పాత్ర లేదని కొంత మంది కావాలనే క్యామ్ స్కానర్ స్కామ్ అంటూ డిఇవోపై విషప్రచారం చేస్తున్నారని అవగాహన లేని ఇలాంటి ప్రకటనలు చేయడం సరికాదని వారు అన్నారు. పిఆర్‌టియు ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

భూకబ్జాను అడ్డుకున్నందుకు దంపతులపై దాడి


గాయపడ్డ క్షతగాత్రులు గంగాధర్, తులసమ్మ

ఇందల్వాయి, జూలై 2: ఇందల్వాయి మండలంలోని గౌరారం పరిధిలోగల సర్వే నంబర్ 180లో భూమిని కబ్జా చేస్తున్నారని తన భూమిని కబ్జా చేయడం సరికాదని అడ్డుకున్నందుకు లింగాపూర్ గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి అనే వ్యక్తి తమపై దాడి చూసి తీవ్రంగా గాయపరిచారని గ్రామానికి చెందిన తులసమ్మ, గంగాధర్‌లు మంగళవారం ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 180లో గల 22 గుంటల భూమిని తమకు ప్రభుత్వం గతంలో కేటాయించిందని అట్టి భూమిలో గత పది సంవత్సరాల నుంచి తామే వ్యవసాయం చేసుకుంటున్నామని అన్నారు. ఈ భూమిపై కన్నేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంతోష్‌రెడ్డి తమను బెదిరిస్తూ కబ్జా చేయాలని చూస్తున్నారని మంగళవారం జెసిబి ట్రాక్టర్లతో చదును చేస్తుండగా తాము అడ్డుకున్నందుకు భార్యభర్తలిరువురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు తెలిపారు. అలాగే నోటికొచ్చినట్లు బూతులు తిట్టి తమను కించపరిచారని ఆరోపించారు. అతనిపై తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సోమవారం ప్రజావాణిలో ఈ భూమి విషయంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. సంతోష్‌రెడ్డి వల్ల తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని అతని బారి నుండి తమను కాపాడాలంటూ పోలీసులను ఆశ్రయించారు. తమ భూమిని తమకు ఇప్పించాలని మంగళవారం తహశీల్దార్ కార్యాలయంకు వెళ్లి రెవెన్యూ అధికారులతో మొరపెట్టుకున్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి నిజానిజాలు తెలుసుకొని కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటామని అన్నారు.

మోస్రా పాఠశాలను డీఈవో ఆకస్మిక తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో


భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మోస్రా,జూలై2: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో డీఈవో దుర్గాప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి మంచిగా చదవాలి అందరు పదికి పది జీపీఏ సాధించాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పరిశీలించి ఉపాధ్యాయ రిజిష్టర్ తనిఖీ చేశారు. అదే విధంగా పాఠశాల ఆవరణలో అసంపూర్ణంగా నిర్మాణంలో ఉన్న వంటగదులను, మూత్రశాలలు త్వరగా పూర్తి చేసేలా చూస్తామని అందుకు సంబంధించిన పూర్తి వివరాలు రాత పూర్వకంగా ఇవ్వాలి అని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభబాయికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్‌తో పాటు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ఉపాధ్యాయులు రాజేశ్వర్, స్వరూప రాణి, సంజయ్ కుమార్, వాణి తదితరులు పాల్గొన్నారు.

పది ఎకరాల వరకు రైతుబంధు ఇవ్వాలని తీర్మానం



ఏర్గట్లలో మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ నర్సయ్య

ఏర్గట్ల, జూలై 2: మండల కేంద్రంతో పాటు తాళ్లరాంపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో మంగళవారం చైర్మన్‌లు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్‌లు మాట్లాడుతూ రైతు సాగు చేస్తున్న ఒక్క పట్టాదారు పాస్‌పుస్తకంపై ఎంత భూమి ఉన్నాగానీ పది ఎకరాల వరకు రైతు బంధు ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మాణం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకర ఆడిట్ అధికారి పాపయ్య మానిటరింగ్ అధికారిణి మంజుల దేవి, కొట్టాల శ్రీనివాస్ రెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, డైరెక్టర్‌లు బద్దం హన్మండ్లు, రేండ్ల రాజారెడ్డి, బద్దం ప్రభాకర్, సీఈవోలు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని రైతు బంధు భవనంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మహాజన సభ నిర్వహించారు. సొసైటీ చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతు బంధు పథకాన్ని పది ఎకరాల వరకు వర్తింపజేయాలని తీర్మానం చేశారు. అంతేగాక రైతులు సూచనలు, సలహాలను అధికారులు రాత పూర్వకంగా తీసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి పాపయ్య, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, సంఘ ఆడిటర్ మంజుల దేవి, మండల వ్యవసాయాధికారి లావణ్య, వ్యవసాయ విస్తీర్ణాధికారులు శ్రీలత, మహేష్, డైరెక్టర్లు మహిపాల్, బాలమల్లేష్, ముత్యాల లక్ష్మణ్, సత్తెమ్మ, ఎలాల భూమారెడ్డి, శంకురి భూమేశ్వర్, కుంట అశోక్‌రెడ్డి, సంఘ పరిధిలోని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక మహాజన సభ సమావేశం సహ కార సంఘం చైర్మన్ బద్దం సంజీవ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నటు సొసైటీ కార్య దర్శి జి.లక్ష్మణ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసాపై సహకార సంఘాల సభ్యుల అభిప్రాయ సేకరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాజన సభకు ప్రభుత్వ అధికారి హాజరై అభిప్రాయాలను సేకరిస్తా రన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో తుకారం రాథోడ్

ఆర్మూర్‌టౌన్ , జూలై2: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌వో తుకారం రాథోడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో పాటు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. రాబోయే వర్షాకాలంలో డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మున్సిపల్ అధికారులకు విద్యార్థులకు ఆయన సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్, మున్సిపల్ కమిషనర్ రాజు, అర్బన్ యూనిట్ అధికారి సాయి,మున్సిపల్ డీఈ భూమేశ్వర్; సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, ప్రేమలత, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'నామమాత్రపు మద్దతు ధరలు పెంచడం సిగ్గుచేటు'


డిప్యూటీతహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆర్మూర్‌టౌన్, జూలై2: కేంద్ర ప్రభుత్వం రైతులకు నామమాత్రపు మద్దతు ధరలు ప్రకటించడం సిగ్గుచేటని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్‌అన్నారు. మంగళ వారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ హరీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జున్ 19న 14పంటలకు మద్దతు ధరలను పెంచుతున్నట్టు ప్రకటించిందని, గత ఏడాది నిర్ణయి ంచిన ధరల కంటే ఐదు నుంచి ఏడు శాతం మాత్రమే పెంచారని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు 20నుంచి 22శాతం వరకు పెరిగాయని తెలిపారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోగటి భువనేశ్వర్, జిల్లా నాయకులు చల్ల గణేష్, గంగారాం, నవీన్, జయ, తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకొని పని చేయాలి


ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డిని సన్మానిస్తున్న మండలస్థాయి అధికారులు

నందిపేట, జూలై2: ప్రజాప్రతినిధులు ఏవరైనా సరే వారికి ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని సమర్థవంతంగా పని చేయాలని ఇంచార్జీ డిప్యూటీ సీఈవో బి.శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిటీసీలకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఈవో బి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల కాలపరిమితి శాశ్వతం కాదని, ప్రజల గుండేల్లో నిలిచిపోయేలా ప్రతీఒక్కరు పని చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ ఐదుసంవత్సరాల పదవి కాలంలో తనకు సహకరించిన ఎంపీటీసీసభ్యులు, అధికారుల పనితీరును చెప్పుకుం టూ భావోద్వేగాని గురైనారు.తన తండ్రివాకిడి నర్సయ్య కోరిక మేరకే ఎం పీటీసీగా గెలిచి ఎంపీపీని అయ్యానని తెలిపారు. అనంతరం ఎంపీపీ, జడ్పీ టీసీ సభ్యురాలు వైఎస్ఎంపీపీ, ఎంపీటీలను మండలస్థాయి అధికా రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఆనంద్‌కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు ఏర్రం యమున, మండల కోఆప్షన్‌సభ్యులు సయ్యద్ హుస్సేన్, ఎంపీవో కిరణ్‌కుమార్, ఆయా గ్రామాల ఎంపిటీసీసభ్యులు, పం చాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తధితరులు ఉన్నారు.

ముగిసిన స్థానిక సంస్థల పదవీకాలం


బాల్కొండ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ముప్కాల్, జూలై2: స్థానిక సంస్థల పదవీకాలం రేపటితో ముగియనుంది. మంగళవారం బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. 2019లో కొలువు దీరిన పాలకవర్గం పదవీ కాలం ముగియనుండడంతో వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఈ పాలకవర్గాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాల, శాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడి, ఎంపీవో వెంకటేశ్వర్‌లు,ఏపీవోఇందిరా,ఉపాధి హామీ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో మంగళవారం ఎంపీటీసీ, మాజీసర్పంచ్ యాల్ల రాజ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ బండమీది గంగాధర్‌ను ఘనంగా సన్మానించారు. మరో రెండు రోజులు పదవీ కాలం పూర్తి కానందున ఎంపీటీసీ రాజ్‌కుమార్, ఇటీవలి వరకు ఉపసర్పంచ్‌గా పని చేసిన బండమీది గంగాధర్‌ను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌చైర్మన్ మహిపాల్, పంచాయతీకార్యదర్శి సుకన్య, లైన్‌మెన్ గోపాల్, హెచ్‌ఎంలు ఇందిరా,అనసూయ, నాయకుడి వెంకన్న, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లి గ్రామ ఎంపిటీసి వెంకయ్యగారి రాంరెడ్డిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆయన పదవీ కాలం ముగియడంతో గ్రామ ప్రత్యేక అధికారి గబ్బర్ సింగ్, పంచాయితీ కార్యదర్శి గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ కాలంలో వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులను ఎవరినైనా బాధ పెడితే క్షమించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


కంచరి రమేష్(ఫైల్

నవీపేట,జులై2: మండలంలోని కోస్లీలో విద్యుద్ఘాతంతో కంచరి రమేష్(43)అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన ప్రకారం మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, భారీ వర్షంతో తన ఇంటి రేకులు గాలికి కొద్దిగా ఎగిరిపోయాయి. రేకులు ఎగిరిపోయే సమయంలో కరెంట్ స్తంభం నుంచి ఇంట్లోకి వచ్చే సర్వీసు వైరుకు చెందిన ఇన్సులేషన్ తొలగిపోయింది. వర్షం తగ్గిన తర్వాత రమేష్ తన ఇంటి రేకులను సరి చేస్తుండగా కరెంట్ వైరుకు చెందిన ఇన్సులేషన్ తొలగిపోయిన భాగానికి రేకు తగలడంతో వెంటనే అతనికి విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. దీంతో అతనిని మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ప్రమాదం జరిగిన సమయంలో భార్య లక్ష్మి కూలీ పనికి వెళ్లింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన జడ్పీచైర్‌పర్సన్

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన జిల్లా ప్రజాప్రతినిధులు


కేసీఆర్‌ను కలిసిన జడ్పీచైర్‌పర్సన్ దఫేదార్ శోభ, రాజు

నిజాంసాగర్, జూలై 2: పదేళ్లు మాకు భిక్ష పెట్టి పదవిని ఇచ్చిన మిమ్మల్ని మరిచిపోమని కామారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ దఫెదార్ శోభరాజు అన్నారు. మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌ను ఎర్రవల్లి ఫాం హౌజ్‌లో కుటుంబ సమేతంగా కలుసుకున్నారు. కేసీఆర్‌ను కలుసుకోవడంతో సంతోషంగా ఉందని దపేదార్ శోభ, రాజు అన్నారు. కేసీఆర్‌తో పాటు కేటీఆర్ రాజకీయ పరిణామాలపై చర్చించారు. పదేళ్ల పాటు చేపట్టిన సంక్షేమ పథకాల గురించి దఫెదార్ శోభ రాజు, కేసీఆర్, కేటీఆర్‌తో గుర్తు చేసుకున్నారు. రేపటితో జిల్లా పరిషత్, మండల ప్రజా పరిషత్ పాలక వర్గం కాల పరిమితి ముగియనుంది. రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వివరించి, కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకతను చేపట్టాలని వారికి ఉద్బోధించారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చే వరకు పార్టీని ఎవ్వరూ వీడరాదని, ప్రజా ప్రతినిధులు దొంగల పార్టీలో చేరుతున్నందున ఎలాంటి బాధ పడాల్సిన అవసరం లేదన్నారు. ఎర్రబల్లి ఫాం హౌజ్‌లో తేనేటి విందుతో కేసీఆర్ కుటుంబ సభ్యులు, దఫేదార్ శోభ, రాజు పాల్గొన్నారు.


.. భిక్కనూరు ఎంపీటీసీలు, విండో చైర్మన్లు

కేసీఆర్‌ను కలిసిన భిక్కనూరు ఎంపీటీసీలు, విండో చైర్మన్లు

భిక్కనూరు: మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్ మండల ఎంపీటీసలు, విండో చైర్మన్లు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఎర్రవెల్లిలోని తన ఫాంహౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులను కేసీఆర్, కేటీఆర్‌కు మండల ఎంపీటీసీలు, విండో చైర్మన్లు వివరించారు. ఈ మేరకు సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీలు, విండో చైర్మన్లను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యాదగిరి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, ఎంపీటీసీలు సాయాగౌడ్, లీలావతి బాలాగౌడ్, యశోద, సువర్ణ ప్రభాకర్, మంజుల రాములు, విండో చైర్మన్ భూంరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు సుల్తానా పాల్గొన్నారు.


సచివాలయంలో సీఎంతో భేటీలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

సచివాలయంలో సీఎంతో భేటీలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, జూలై 2: సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటి నోకియా సంస్థ ప్రతినిధి బృందం భేటి అయింది. ఈ భేటీలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో పాటు మోహన్ నోకియా గ్లోబల్ హెడ్‌మార్టిన్, సేల్స్ హెడ్ మ్యాన్స్, గ్లోబల్ డైరెక్టర్ వెంకట్, పద్మజ, రాజేష్, సీఎస్‌రావులు పాల్గొన్నారు.

బాన్సువాడలో కురిసిన వర్షం

బాన్సువాడ టౌన్, జూలై 2: బాన్సువాడ పట్టణంలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు వర్షం కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అన్నదాతలు పంట పొలాల్లో నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు.


పాఠశాల ఆవరణలో వేసిన వ్యర్థాలను చూపుతున్న చైర్‌పర్సన్

పాఠశాలలో అపరిశుభ్రతపై చైర్‌పర్సన్ ఆగ్రహం

కామారెడ్డి టౌన్, జూలై 2: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరాల్లో అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనార్టీ బాలికల పాఠశాలలో సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని పిల్లలకు ఒకేరకమైన మెనూ అమలు చేస్తున్నారని తెలిపారు. బాత్‌రూంలు, టాయిలెట్‌ల నిర్వహణ అధ్వానంగా ఉందని, మంచినీటి సౌకర్యం కల్పించడం లేదని పిల్లలు తమ ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. మైనార్టీ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని సిబ్బంది నిర్లక్ష్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ ప్రాజెక్టుకు
సింగూరు జలాలు విడుదల చేయాలి



● కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పండరి

నిజాంసాగర్, జూలై 2: నిజాంసాగర్ ప్రాజెక్టుకు సింగూరు జలాల ను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ప్రజా పండరి కోరారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుపై ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులకు పంటల కోసం ఒక్క టీఎంసీ నీటిని మాత్రమే వదిలారని, 30 శాతం వరి నాట్లు మాత్రమే వేసినట్లు తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందన్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సింగూరు నుంచి ఒప్పందం ప్రకారం 8.5 టీఎంసీల నీటిని విడుదల చేసి రైతాంగానికి ఆదుకోవాలన్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులో నీరు రైతుల పంట పొలాలకు సరిపోవని, ప్రణాళిక ప్రకారం నీరు విడుదల చేస్తే ఒకటి, రెండు విడతలుగా కూడా విడుదలకాదన్నారు. సంబంధిత పాలకులు, మంత్రి వెంటనే స్పందించాలన్నారు.


మేనూర్ శివారులో భూ సర్వే చేస్తున్న ఆర్ఐ

మిస్సింగ్ సర్వే నెంబర్‌లపై భూ సర్వే

మద్నూర్, జూలై 2: రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో భూ సర్వే నెంబర్లను మిస్సింగ్ కావడంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వాటిని పరిష్కరించే బాధ్యతను తహసీల్దార్‌లకు అప్పగించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది మండలంలోని ఆయా గ్రామాల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి భూ సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భూ విస్తీర్ణంలో హెచ్చు తగ్గులను గుర్తించి దరఖాస్తు చేసుకున్న రైతులకు న్యాయం చేయడానికి సర్వేలు ప్రారంభించారు. మంగళవారం మండలంలోని మేనూర్ గ్రామ శివారులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్ భూ సర్వే నిర్వహించారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

బీర్కూర్, జూలై 2:మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శ్రీలేఖ మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి మందులను అందజేశారు. 30 ఏళ్లు దాటిన ప్రతీ మహిళా తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ శ్రీలేఖ మహిళలకు సూచించారు.

ప్రతీ బీజేపీ కార్యకర్త అమ్మతో కలిసి మొక్క నాటాలి

● ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్, జూలై 2: ప్రతి బీజేపీ కార్యకర్త అమ్మతో కలిసి ఒక మొక్క నాటి సోషల్ మీడియాలో పెట్టాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. మంగళవారం ప్రధాని మోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ కా నామ్ అమ్మ పేరిట ఒక్క మొక్క కార్యక్రమంలో భాగంగా కామారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ప్రధాని ప్రారంభించిన ఏక్ పేడ్ కా నామ్ అమ్మ పేరిట ఒక్క మొక్క కార్యక్రమంలో భాగంగా ప్రతి బీజేపీ కార్యకర్త అమ్మతో కలిసి ఒక్క మొక్క నాటి ఆ ఫోటోను సోషల్‌మీడియాలో పెట్టాలని, ఆ మొక్క పెద్దగా అయ్యేవరకు దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యతని, యువత, మహిళలు అందరు ఆ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 6న శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని నియోజకవర్గంలోని ప్రతిగ్రామంలో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేసుకోవాలి

భిక్కనూరు, జూలై 2: ప్రభుత్వం చేపట్టే వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు గ్రామాల్లో గుంతలు సిద్ధం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారిణి రజిత అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని నర్సరీని మండల ప్రత్యేక అధికారిణి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈవో మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నేతలు

నాగిరెడ్డిపేట, జూలై 2: మండలంలోని తాండూర్ గేట్ వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డిలు మొక్కలు నాటారు. తాండూర్ గేట్ వద్ద ఫారెస్టు ఏరియాలో మండల ఫారెస్టు అధికారులతో కలిసి వీరు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వాసుదేవ్, ఫారెస్టు సెక్షన్ అధికారి సంతోష్‌రెడ్డి, ఫారెస్టు బీట్ అధికారులు నవీన్, నాగరాజు, లావన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోచారంను కలిసిన కార్పొరేషన్ చెర్మన్

బాన్సువాడటౌన్, జూలై 2: కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ మంగళవారం పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

మద్నూర్, జూలై 2: మండలంలోని సాగు చేసిన పంటలను కేంద్రీయ సస్యరక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు నీలా రాణి, రవి శంకర్‌లు సోయాబీన్, పెసర, మినుము, కంది, పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం సోయా పంటలలో రసం పీల్చే పురుగు, సొగాకు లద్దె పురుగు, కాండం ఈగ ఆశించే అవకాశం ఉందని, నివారణకు రసం పీల్చే పురుగు, తెల్ల దోమ, పచ్చ దోమ ఉన్నట్లయితే ఏసీఫెట్ 300 గ్రాములు ఒక ఎకరానికి, లద్దే పురుగు ఉన్నట్లయితే ఏమనెక్టిన్ బెంజయేట్ 80 గ్రాములు ఎకరాకు, అలాగే కాండం ఈగ గమనించినట్లయితే తొలిదశలో మొక్క వదిలిపోయి ఉండి ఆకులు రాలిపోయి పోతే ఏసైఫెట్ 300 గ్రాముల ఎకరాకు, కాండం తొలిచే పెంకు పురుగు ఉన్నట్లయితే క్వినల్ఫాస్, లేదా ప్రొఫినోఫాస్ 400 గ్రాముల మందును ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు, ఏఈవో ప్రియాంక, రైతులు సాయిలు, వినోద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మద్నూర్, జూలై 2: డోంగ్లీ మండలంలోని మొగా గ్రామంలో సీసీ రోడ్డు పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బస్వరాజ్ పటేల్ ప్రారంభించారు. ఇటీవల జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు ఆయా గ్రామాలకు సీసీ రోడ్లు మంజూరు చేయడం జరిగింది. అందులో భాగంగా మొగా గ్రామంలో ఐదు లక్షలతో సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులు ప్రారంభించారు.

పంచాయతీరాజ్ డీఈకి సన్మానం

పెద్ద కొడప్‌గల్, జూలై 2: జుక్కల్ పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇంజనీర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మదుబాబును మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ మాట్లాడుతు మండలానికి నూతనంగా డిప్యూటి ఇంజనీర్‌గా మదుబాబు రావడం సంతోషంగా ఉందన్నారు. మండలంలో పంచాయతీ రాజ్ శాఖ పనులు చురుకుగా సాగేలా చర్యలు తీసుకోవాలని డీఈని కోరినట్లు తెలిపారు.

నిధుల కొరతతో రైతు సదస్సులు చేపట్టలేదు

● జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ

కామారెడ్డి టౌన్, జూలై 2: నిధుల కొరత వల్ల ఆత్మ నుంచి రైతు సదస్సులు, విజ్ఞానయాత్రలు, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించడం లేదని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 30న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఆత్మకు ఆదరణ కరువు' అనే కథనంపై ఆమె స్పందించారు. జిల్లాలో 9 మంది ఎటీఎంలు, బీటీఎంలు ఆత్మ ప్రాజెక్ట్ నందు పని చేస్తున్నారని తెలిపారు. ప్రతీవారం వారికి కేటాయించిన క్లస్టర్‌లలో రైతులకు వారు పండించే పంటలపై రెండు సార్లు సమావేశాలు నిర్వహించడం, శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన 14 రైతువేదికల్లో ప్రతీవారం రెండుసార్లు క్లస్టర్‌ల వారిగా రైతులు పండించే పంటలపై అవగాహన కల్పించుట, సైంటిస్టులచే సాంకేతిక సూచనలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గత ఫిబ్రవరి 16న అగ్రిటెక్ సౌత్ ఇంటర్ డిస్టిక్ ఎక్స్‌పోజర్ విజిట్‌ను హైదరాబాద్‌లోని రాజేందర్‌నగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన రైతులు హాజరయ్యారని తెలిపారు. జూన్ 24 నుంచి జూలై 5 వరకు రైతులకు కల్తీ విత్తనాలపై అవగాహన కార్యక్రమాలను రైతు వేదికల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నసురుల్లాబాద్, జూలై 2: మండల కేంద్రంలోని మండలాభివృద్ధి కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పాల్త్యా విఠల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మూడు నెలలుగా మండలంలో జరిగిన సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో నీలావతి, ఎంపీవో రాము, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ జన్ను బాయి ప్రతాప్, ఆయా శాఖల అధికారులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

మాచారెడ్డి, జూలై 2: మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామంలో పుట్ట భూమయ్య(50) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు మాచారెడ్డి పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం 11గంటలకు భూమయ్య తన వ్యవసాయపోలంలో నీటిపైపు లీక్‌కావడంతో వాటికి బట్టలు కడుతుండగా విద్యుత్ షాక్‌తో అక్కడిక్కక్కడే మృతిచెందాడు. మృతుని భార్య పుట్టబాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు, జూలై 2: మండలంలోని బాగిర్తిపల్లి గ్రామంలో అప్పుల బాధ భరించలేక ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మంద రమేష్ (29) చేసిన అప్పులు తీర్చలేక గత నెల 27న పురుగుల మందు తాగాడని, కుటుంబ సభ్యులు గమనించి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భర్త సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

వైద్యులు దైవంతో సమానం

సదాశివనగర్, జూలై 2: వైద్యులు దైవంతో సమానమని లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి అన్నారు. మంగళవారం డాక్టర్స్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు.

పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి : డీఈవో

లింగంపేట, జూలై 2: పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని డీఈవో రాజు అన్నారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో సజనల్ వ్యాదులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆయన సూచించారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, విషజ్వరాలు వస్తున్నందున పాఠశాలల్లోని మరుగుదొడ్లు, మూత్రశాలలు, కులాయిల వద్ద నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. పాఠశాల పరిసరాలలో పిచ్చిమొక్కలు లేకుండా తొలగించాలని ఆయన తెలియజేశారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్‌తో పాటు మైనర్ రిపేర్లు పూర్తి చేసినట్లు ఆయనతెలిపారు. ఎమ్‌ఆర్సీని తనిఖీ చేసి మండలంలో ఎన్ని పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు వివరాలు తెలుసుకుని రికార్డులు తనిఖీ చేశారు. జిల్లాల్లో అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యేనిఫామ్స్ పంపిణీ చేశామని ఆయన తెలియజేశారు. విద్యార్థులకు పంపిణీ చేసిన వివరాలను అన్ని పాఠశాలల నుంచి వివరాలు పంపాలని ఆయన ఆదేశించారు. ఉపాధ్యాయుడు వాహీద్‌సిద్దీఖీ, సీఆర్‌పీలు, గంగాధర్, విజయ్‌లు ఉన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని ఏబీవీపీ నిరసన

కామారెడ్డి రూరల్, జూలై 2: నిరుద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఏబీవీపీ కార్యకర్తలు కళాశాలల ముందు కండ్లకు గంతలు కట్టుకిని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా హస్టల్ కన్వీనర్ ఖలీల్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడు నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి 11వేల ఉద్యోగాలు వేయడం సిగ్గుచేటని అన్నారు.అలాగే గ్రూప్ 1 ప్రిలిమ్స్ 1:100 అభ్యర్థులను శార్ట్ లిస్ట్ చేస్తామని చెప్పి చేయలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రత్యూష, అల్తాఫ్, రాజు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

దోమకొండ, జూలై 2: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఎక్కి ఒక వ్యక్తి మృతి చెందాడు? మండల కేంద్రానికి చెందిన తులసిగారి బాలు బస్టాండ్ పక్కన గల మెయిన్‌రోడ్డులో లాండ్రి నడుపుతున్నాడు. అయితే ఆయన లాండ్రి దుకాణం నుంచి తన ఇంటికి వెళుతుండగా బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ బస్సు అతనిపై నుంచి ఎక్కడంతో కడుపులో ఉన్న అవయవాలు బయటకు వచ్చాయి. దీంతో బాలు అక్కడిక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న పోలీసులు బాలు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై స్థానిక ఎస్సై గణేష్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. కాగా బస్టాండ్ వద్ద జరిగిన సంఘటనకు సంబంధించి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొండి మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డిరూరల్, జూలై 2: కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని సరంపల్లి పాత హైవే రోడ్డుపై గల మొండి మైసమ్మ తల్లి దేవాలయ మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.బోనాలు తీసి అమ్మవారికి నైవేద్యాలు అందించారు. అనంతరం గ్రామ ప్రజలందరికి అన్నప్రసాదాలు పంచారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ ఆకుల రూపరవికుమార్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయంపై రైతులకు అవగాహన

నసురుల్లాబాద్, జూలై 2: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సమగ్ర వ్యవసాయం గురించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నరేంద్ర మాట్లాడుతూ వ్యవసాయంపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఏఈవోలు మీనా, దతేశ్వరి, భాను ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

'ఏబీసీడీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై తరలిరావాలి'

కామారెడ్డిరూరల్, జూలై 2: ఏబీసీడీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై నిర్వహించే హలో మాదిగ చలో ప్రకాశం జిల్లాకు తరలిరావాలని మాదిగ రాజకీయ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు బి.ఎన్.రమేష్ మాదిగ ఇచ్చిన ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్.బి.గెస్ట్ హౌస్‌లో కరపత్రాలను విడుదల చేశారు. మహజాతరకు మాదిగలు పెద్దయెత్తున తరలిరావాలన్నారు.నూతనంగా ఏర్పడిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏబీసీడీ బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశాలలో పాస్‌చేసి చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న, ఆర్.భాగయ్య, బాలమణి, రాజమణి, అశోక్, చిన్న రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి


రాజంపేటలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న బీజేవైఎం నాయకులు

రాజంపేట, జూలై 2: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ అనిల్‌కుమార్‌కి నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రూప్1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలీఫై చేయాలని, గ్రూప్-2,3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని అన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగారెడ్డి, సంపత్‌రెడ్డి, నవీన్, సాయిరెడ్డి, ప్రవీణ్, మనోహర్, లక్ష్మణ్, స్వామి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సదాశివనగర్: నిరుద్యోగుల సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని మండల బీజేవైఎం అధ్యక్షుడు కృష్ణారావు అన్నారు. మంగళవారం తహసీల్దార్‌కు బీజేవైఎం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్టించుకోవడం లేదని, వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, సంజీవరెడ్డి, వంశీ, జైపాల్‌రెడ్డి, మోహన్, రాజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
శాంతి	ఓసీ	మహేశ్వరి	కల్కి
దర్శన్	మహారాజ	వెంకటేశ్వర	మహారాజ
ప్రియా 70	కల్కి		

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్ (కిలో)	170	220	230

